చర్చాగోష్ఠిలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ట్రెసా రాష్ట్ర ప్రతినిధులు

ప్రభుత్వానికి కళ్లు, చెవులు రెవెన్యూ వ్యవస్థే

• ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

కలెక్టరేట్, ఆగస్టు 11 : ప్రభుత్వానికి కళ్లు, చెవులు రెవెన్యూ వ్యవస్థ మాత్రమేనని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవస్థ బలోపేతంతోనే భూవివాదాలు సద్దుమణుగుతాయనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం దీనిని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వీఆర్‌ఏ, వీఆర్‌వోల వ్యవస్థను తిరిగి కొనసాగించేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సాదాబైనామాల పద్ధతికి స్వస్తి పలుకాల్సిన అవసరముందన్నారు. ఈ విధానంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గుతుందని, సొంత కుటుంబంలోనే కక్షలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చర్చావేదికలో ఎమ్మెల్యే డా. కె.సత్యనారాయణ, సుడా చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సతీశ్, టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జడ్జి ఈశ్వర్, జనగామ అనిల్, కొరివి వేణుగోపాల్, తదితరులు మాట్లాడారు. ఆర్డీవోలు కె.మహేశ్వర్, ఎన్.శ్రీనివాస్, ట్రెసా జిల్లా ప్రతినిధులు వెంకటరెడ్డి, పి.కేశవరెడ్డి, గడ్డం సుధాకర్, విజయ్, రాజ్‌కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రికి మాజీ ప్రజాప్రతినిధుల వినతి

కొత్తపల్లి, ఆగస్టు 11: మండలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు కరీంనగర్‌లో జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ప్రజాప్రతినిధులు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రిజిస్ట్రేషన్లను 30 కిలోమీటర్ల దూరంలో గల గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయడం ద్వారా వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపీటీసీ మడుపుమోహన్, మాజీ సర్పంచులు గడ్డం శ్రీరాములు, బొమ్మ ఈశ్వర్‌గౌడ్, బోనాల మురళీ మనోహర్ ఉన్నారు.

'ఇంటింటా జ్వరాలతో ఇబ్బందులు'

చొప్పదండి, ఆగస్టు 11: పట్టణంలోని 12, 13వ వార్డుల్లో ఇంటింటా జ్వరాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని చొప్పదండి బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ ఆచార్యులు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా మారిందని, మున్సిపల్ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని, గడ్డి తొలగించడం లేదని విమర్శించారు. వారం రోజుల నుంచి ఇంటికి ఇద్దరు ముగ్గురు జ్వరాల బారిన పడుతున్నారని, మహిళలు కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఈ కాలనీలో సరైన పరీక్షలు చేయకపోవడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాధితులు ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయించాల్సి వస్తున్నదన్నారు. వెంటనే రెండు వార్డుల్లోనూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దేశసేవకు ముందుకురావడం గొప్ప విషయం

- మిమ్మల్ని ఇక్కడికి పంపిన మీ తల్లిదండ్రులు నిజమైన దేశభక్తులు
- ఢిల్లీ డిఫెన్స్, జూనియర్ కళాశాల ఫ్రెషర్ డే వేడుకల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కొత్తపల్లి, ఆగస్టు 11: విద్యార్థి దశలోనే దేశ సేవకు ముందుకు వచ్చి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రంగాలను ఎంచుకోవడం గొప్ప విషయమని, ఈ విషయంలో మిమ్మల్ని ఇక్కడికి పంపించిన మీ తల్లిదండ్రులు నిజమైన దేశభక్తులని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని రేకుర్తి రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాలల 'ఫ్రెషర్స్ డే'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యువత ఇంజినీరింగ్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో దేశానికి సేవ చేసే రంగాలను ఎంచుకున్న విద్యార్థులను గొప్పవారిగా అభివర్ణించారు. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంచుతూ ఇప్పటి వరకు ఏడేళ్లలో సుమారు 2 వేలకు పైగా విద్యార్థులను ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యేలా శిక్షణ అందించిన ఢిల్లీ డిఫెన్స్ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. సాహసోపేత నిర్ణయాలకు పీఎం నరేంద్రమోదీ కేరాఫ్‌గా నిలుస్తున్నారని, 370 ఆర్టికల్ రద్దే దీనికి నిదర్శనమన్నారు. కేంద్రం తీసుకొచ్చిన 'అగ్నిపథ్ స్కీం గొప్పదని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేశాయే తప్ప, అందులోని తప్పులను ఇప్పటికీ వెల్లడించక తోక ముడిచాయన్నారు. ఈ స్కీంలో ఏమైనా ఇబ్బంది ఉంటే కేంద్రం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని, విపక్షాల వలలో పడి విద్యార్థులు మోసపోవద్దన్నారు. అగ్నిపథ్ ద్వారా శిక్షణలు పొంది నాలుగేళ్ల తర్వాత బయటికి వచ్చిన వారికి కార్పస్ ఫండ్ పేరిట రూ.5 లక్షలు, కేంద్రం మరో రూ.5 లక్షలు, మొత్తం వడ్డీతో కలిసి రూ. 11 లక్షలు చెల్లిస్తుందన్నారు. భవిష్యత్తులో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో అగ్నివీరులకు 10 శాతం రిజర్వేషన్ కోటాను ప్రకటించిందని, 4 ఏళ్ల పాటు ఉద్యోగం చేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే రూ.48 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. విధి నిర్వహణలో చనిపోతే రూ. 44 లక్షలను ఎక్స్‌గ్రేషియా రూపంలో అందిస్తుందని తెలిపారు. యూపీఏ 10 ఏళ్ల పాలనలో 7 లక్షలలోపు ఉద్యోగాలను భర్తీ చేస్తే మోదీ ప్రభుత్వం ప్రతినెలా 70 -90 వేల చొప్పున ఒక్క ఏడాదిలోనే 10 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్, కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన ఓ జవాను పోరాట పటిమ గురించి చెప్పగా విద్యార్థులు ఉద్వేగానికి లోనయ్యారు. దేశ సేవ చేసి కుటుంబానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా దేశభక్తిపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జబర్దస్ ఫేం ఆర్టిస్టులు రాజమౌళి, వినోద్, జీవన్, మోహన్ కామెడీ స్కిట్స్ విద్యార్థుల్లో జోష్‌ను నింపాయి. ఢిల్లీ డిఫెన్స్ విద్యా సంస్థల చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యాదగిరి శేఖర్‌రావు, గంగాడి కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, మదర్ థెరిస్సా లెజెండరీ అవార్డులు అందుకుంటున్న గోనెల సమ్మయ్య, ముద్దసాని శ్రీనివాస్

మల్లారెడ్డిపల్లి వాసులకు లెజెండరీ అవార్డులు

వీణవంక, ఆగస్టు 11: మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల సమ్మయ్య, ముద్దసాని శ్రీనివాస్ ఎన్టీఆర్, మదర్‌థెరిస్సా లెజెండరీ అవార్డులు అందుకున్నారు. గోనెల సమ్మయ్య ముదిరాజ్ సాహిత్య రంగంలో కృషి చేస్తూనే అమ్మ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ముద్దసాని శ్రీనివాస్ రచయితగా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వీరిని అవార్డులకు ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సమ్మయ్యకు ఎన్టీఆర్, శ్రీనివాస్‌కు మదర్‌థెరిస్సా లెజెండరీ అవార్డులను బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, దైవాజ్ఞశర్మ, సినీ నిర్మాత సత్యవెంకట్ చేతుల మీదుగా అందజేశారు. వీరు లెజెండరీ అవార్డులు అందుకోవడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోనెల సమ్మయ్య, ముద్దసాని శ్రీనివాస్ అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్, చైర్మన్ డా.సరోజనమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బంగారు పతకం విజేతకు మంత్రి పొన్నం అభినందన

కొత్తపల్లి, ఆగస్టు 11 : హాంకాంగ్‌లో మే 6 నుంచి 11 వరకు నిర్వహించిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఇండియా తరపున పాల్గొని బంగారు పతకం సాధించిన తుడి సిరిచందనను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. 52 కేజీల విభాగంలో పోటీపడ్డ ఆమె అద్భుత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఆదివారం మంత్రిని ఆయన నివాసంలో కలువగా అభినందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలు టోర్నమెంట్‌లో పాల్గొనలేకపోతున్నానని ఆమె మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట శ్రీదేవి, ఆంజనేయులు గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 11: జిల్లా కేంద్రంలోని మాస్క్ ఫిలిం ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రేయిన్‌బో పాఠశాలలో నిర్వహించిన ఒక రోజు నట శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా టౌన్ ప్రెసిడెంట్ రాహుల నరేశ్ హాజరై మాట్లాడారు. నటన నేర్చుకోవడం వల్ల స్టేజీ ఫియర్, బిడియం పోయి సమయస్ఫూర్తి పెరుగుతుందని, ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్న యాక్టింగ్ కోచ్, సంస్థ చైర్మన్ అనసూరి భూనాథాచారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కిడ్స్ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ సదాశ్రీ, మాస్క్ కోఆర్డినేటర్ వంగల శ్రీధర్, శ్రీరామోజు రవీంద్రాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఆగస్టు 11: నగరంలో కొత్త డీటీఆర్ లైన్ పని చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సన్ షైన్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, రావు బ్రదర్ చిట్ ఫండ్ ఏరియా, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు సాయిరాంనగర్ రోడ్ నంబర్-5, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతం, మెహర్ నిలయం, సీతారాంపూర్‌లో కొంత ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హనుమాండ్ల ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రామడుగు, ఆగస్టు 11 : గోపాల్‌రావుపేటలో గ్రామ పంచాయతీ సమీపంలో గల ఆంజనేయ స్వామి ప్రధాన ఆలయం శిథిలావస్థకు చేరడంతో, గ్రామానికి చెందిన నేచర్ యూత్‌క్లబ్ సభ్యులు ఆలయ పునర్నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గ్రామంలోని పద్దెనిమిది కుల సంఘాలతో కలిసి రోటిగూడెం శ్రీహరి మౌనస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నూతన ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. పాత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొనపాటి సీతారాంరెడ్డి, నార్ల రమేశ్, దాసరి రాజేందర్‌రెడ్డి, కర్ర సత్యప్రసన్న, ముదుగంటి రాజిరెడ్డి, ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పాపిరెడ్డి, నేరెళ్ల అంజయ్యగౌడ్, కర్యాద హన్మంత రెడ్డి, ఏగోలపు మల్లేశంగౌడ్, ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి, కల్లెం అంజయ్య, అలువాల విష్ణు, నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములు గౌడ్, శ్రీ వేంకటేశ్వర స్వామి, హరిహరపుత్ర అయ్యప్ప స్వామి, రాజరాజేశ్వర స్వామి ఆలయాల అర్చకులు డింగిరి సత్యనారాయణాచార్యులు. డింగిరి వెంకటరమణాచార్యులు, ఉర్కేటి రవికిరణాచార్యులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'భక్తి గీతాల గానలహరి' ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 11: జిల్లా కేంద్రానికి చెందిన నీలకంఠ భజన మండలి భజన పాటల పుస్తకం భక్తి గీతాల గానలహరి, భజన మండలి పాట ఆవిష్కరణ కార్యక్రమం ఫిలింభవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాని ఈవెంట్స్ డోలక్ రాజు ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమం అనంతరం చిన్నారులతో భజన పాటల పుస్తకం, భజన మండలి పాట ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో శ్రీ నీలకంఠ భజన మండలి గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, నీలకంఠ భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల శ్రీధర్ గౌడ్, డోలక్ రాజు, శ్రీ నీలకంఠ భజన మండలి సభ్యులు, భక్తులు, కవులు, కళాకారులు, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

చొప్పదండి, ఆగస్టు 11: ఆర్నకొండ గూడ్స్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం నియమించారు. గౌరవాధ్యక్షుడిగా దామెర నాగరాజు, అధ్యక్షుడిగా బొల్లం సంపత్, ఉపాధ్యక్షులుగా ఉండుంటి అబ్రహం లింకన్, కూన కుమార్, ప్రధాన కార్యదర్శులుగా కూన అనిల్, అనుమండ్ల అశోక్, కోశాధికారులుగా మచ్చ మహేశ్, కుక్కల రమేశ్, ప్రచార కార్యదర్శిగా ముద్ద అజయ్, ముఖ్య సలహాదారులుగా మిల్కూరు రవి, తాళ్లపెల్లి లక్ష్మణ్, మడిగల శ్రీకాంత్, చిలుముల దిలీప్, ఇరుకుల్ల సంతోష్, జాగిరి శివరాజ్, తదితరులు నియామకమయ్యారు.

అపూర్వ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంతో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గంగాధర, ఆగస్టు 11 : గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఇక్కడ పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కవులే సమాజానికి దిక్సూచి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయేందర్‌రెడ్డి, తదితరులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 11: నాటి నుంచి నేటి వరకు కవులే సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నారని ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు, సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి కొనియాడారు. స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన మెరుపు తీగలు మణిపూసలు సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, సంకలనం సరళమైన పదాలతో అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో ఉందని అభినందించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా టి. ఆశీర్వాదం హాజరుకాగా, కవులు, రచయితలు గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, నలిమెల భాస్కర్, కందుకూరి భాస్కర్, కొత్త అనిల్ కుమార్, గంప ఉమాపతి, ఇటికాల రాము, బొమ్మకంటి కిషన్, విలాసాగరం రవీందర్, మియాపురం శ్రీనివాస్, పెద్ది రాజు, పాక రామ్మోహన్, గూడెపు కుమార్, గుగ్గిళ్ల నాగభూషణాచారి, అడ్డగూడి ఉమాదేవి, వంగరి వెంకటేశం, మాంకాలి సుగుణ, జి. మధు మురళి, సిరిపురం వాణిశ్రీ, బోయిని నాగరాజు, కాడె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జీవీఆర్ పరామర్శ

మానకొండూర్ రూరల్, ఆగస్టు 11: అన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మేడి శ్రీనివాస్ భార్య పద్మ, మాజీ సర్పంచ్ ఆరెల్లి సంపత్ గౌడ్ తల్లి రామలక్ష్మి, పురుషోత్తం అనిల్ కుమార్ తండ్రి ఆంజనేయులు ఇటీవల మృతి చెందగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, నాయకులు పిట్టల మధు, యాదగిరి, నెల్లి శంకర్, ఉండింటి శ్యామ్సన్, గణేశ్, వీరేశం, పురం అనిల్ కుమార్ తదితరులున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

తెలంగాణచౌక్, ఆగస్టు 11: బ్రాహ్మణుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తున్నదని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్‌బాబు విమర్శించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణ పరిషత్‌ను కార్పొరేషన్‌గా మార్చి రూ.500 కోట్లు కేటాయించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బ్రాహ్మణుల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన నిధులే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందేమీ లేదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న పేద బ్రాహ్మణ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 11: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో ఆదివారం నిర్వహించిన గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, కొమురయ్య పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా గ్రామస్తులు

సైదాపూర్, ఆగస్టు 11: ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన నిరుపేద కందుకూరి నిరంజన్ అనారోగ్యంతో మృతిచెందగా, అతడి కుటుంబసభ్యులకు గ్రామస్తులు అండగా నిలిచారు. గ్రామంలోని పలు వాట్సాప్ గ్రూప్‌లలో బాధిత కుటుంబాన్ని ఆదుకుందామంటూ పోస్టులు చేశారు. ఈ మేరకు స్వర్ణకార సంఘం జిల్లా కార్యదర్శి పూసాల రమేశ్ తనవంతు సాయంగా రూ. 10 వేలు, జిల్లా స్వర్ణకార సంఘం తరపున రూ. 16,500 అందించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, స్నేహితులు పలువురు ఫోన్‌పే ద్వారా తమకు తోచినంత ఆర్థికసాయం అందించి ఔదార్యాన్ని చాటారు.

చిగురుమామిడిలో 'హర్ ఘర్ తిరంగా'

చిగురుమామిడి, ఆగస్టు 11: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహాన్ని బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ఆదివారం బీజేపీ కోఆర్డినేటర్లు కంది శంకర్, గందె చిరంజీవి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మహాత్మా గాంధీ విగ్రహాన్ని శుద్ధిచేసి పూలమాలలతో అలంకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, విశ్వకర్మ సెల్ మండల కన్వీనర్ గొల్లపల్లి సదాచారి, నాయకులు రామన్న, రమేశ్, కరుణాకర్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఫైనాన్షియర్లపై ఐటీ కన్ను

హుజూరాబాద్, ఆగస్టు 11: ఇటీవల ఓ రాజకీయ నాయకుడు అప్పు తీసుకున్న విషయంలో ఫైనాన్షియర్ కిరికిరి పెట్టడంతో సీపీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే పోలీసులు కూపీ లాగితే 10 నుంచి 15మంది బడా ఫైనాన్సియర్లు భూములను మార్టిగేజ్ చేసుకుని కోట్ల రూపాయల్లో అప్పులు ఇస్తున్నట్లు తేలింది. అప్పు తీసుకున్న చాలా మంది మిత్తికి మిత్తి చెల్లించలేని పరిస్థితిలో ఫైనాన్షియర్లు భూములను అగ్గువ సగ్గువకు స్వాధీనం చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. కాగా, సీపీకి ఫిర్యాదు చేసిన సదరు రాజకీయ నాయకుడు, ఫైనాన్సియర్ల విషయాన్ని ఐటీశాఖ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆశాఖ ప్రాథమిక విచారణ జరుపగా, పెద్ద మొత్తంలో అప్పులు ఇస్తూ ప్రభుత్వానికి మాత్రం నామమాత్రపు పన్ను చెల్లిస్తున్నట్లు తేలింది. దీంతో ఐటీశాఖ అధికారులు హుజూరాబాద్ ఫైనాన్షియర్లపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి, దాడులకు రంగం సిద్ధం చేసుకున్నట్లు వినికిడి. ఐదేండ్ల క్రితం హుజూరాబాద్ ఫైనాన్షియర్లపై అప్పటి సీపీ ఆధ్వర్యంలో దాడులు జరుగగా, ఇద్దరు ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. దీంతో చిన్నపాటి ఫైనాన్షియర్లు మిత్తి వ్యాపారాన్ని తగ్గించుకోగా, బడా ఫైనాన్షియర్లు మాత్రం హుజూరాబాద్‌లో పెద్దమొత్తంలో అప్పులు ఇస్తూ తమ దందాను విస్తరించుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తా

తిమ్మాపూర్, ఆగస్టు 11: తిమ్మాపూర్ మండలాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఆదివారం తిమ్మాపూర్, రామకృష్ణకాలనీ గ్రామాల్లో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల నాయకులు ఘన స్వాగతం పలికారు. మహిళా సంఘ భవనాల కోసం నిధులు కేటాయించాలని మహిళలు వినతి పత్రం అందజేశారు. అలాగే పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి అఖిల ఇటీవల ఆత్మహత్య చేసుకోగా.. వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని పోరండ్ల బీజేపీ నాయకులు కోరారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, అలవెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, పీఆర్ డీఈ మంజు భార్గవి, ఏఈ సురేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు జగదీశ్వరాచారి, నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ముత్యాల జగన్ రెడ్డి, ఎడ్ల జోగిరెడ్డి, సొల్లు అజయ్ కుమార్, బూట్ల శ్రీనివాస్, వేల్పుల రవీందర్ యాదవ్, వేల్పుల ఓదయ్య, ఆవుల వేణు పాల్గొన్నారు.

రైతులకు అన్నివిధాలా సహకారం

మానకొండూర్ రూరల్, ఆగస్టు 11: కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అన్నారం గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మన్ పాకాల పురుషోత్తం రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడిబుల్ టీ కప్పుల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కేవీకే (జమ్మికుంట) శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ముందుకు వచ్చేవారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్ రావు, వ్యవసాయ శాస్త్రవేత్త డీఎస్ రావు, జనరల్ సెక్రటరీ విజయ్ గోపాల్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సీడీ జనరల్ సెక్రటరీ సాయి, గృహ శాస్త్రవేత్త ప్రశాంతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, గుర్రాల వెంకట రెడ్డి, తహసీల్దార్ బండి రాజేశ్వరి, సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

మానకొండూర్, ఆగస్టు 11: మండల కేంద్రంలోని శ్రీమహంకాళీ ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఆయన శ్రీమహంకాళీ ఆలయాన్ని సందర్శించగా, ఆలయ కమిటీ సభ్యులు ఆరెపల్లి సునంద్, కొండ్ర శంకర్, కొండ్ర వెంకటస్వామి, బొద్దుల ఆంజనేయులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు మియ్యాపురం లక్ష్మణాచారి, సొన్నాకుల శ్రీనివాస్, ప్రదీప్‌యాదవ్, కొండ్ర సురేశ్ పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీపౌర్ణమి, వినాయక చవితి పండుగల సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 10 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

టీహెచ్‌ఏలో జిల్లావాసులకు చోటు

కొత్తపల్లి, ఆగస్టు 11: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (టీహెచ్‌ఏ) కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జనరల్ బాడీ సమావేశం అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బసరవేణి లక్ష్మణ్‌ను తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లాకు చెందిన నమిలికొండ ప్రభాకర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన అధ్యక్ష కార్యదర్శులు ఎం యశస్వి, శ్యామల పవన్‌కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర యువ ప్రతినిధిగా శ్రీనివాస్

తొర్తి శ్రీనివాస్

కొత్తపల్లి, ఆగస్టు 11 : ఢిల్లీలోని ఎర్రకోటలో ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలకు తెలంగాణ రాష్ట్ర యువ ప్రతినిధిగా కరీంనగర్‌లోని సరస్వతీనగర్‌కు చెందిన యువశక్తి యూత్ సభ్యుడు తొర్తి శ్రీనివాస్ ఎంపికయ్యాడు. సామాజిక, సేవారంగంలో విశేష కృషి చేస్తున్న ఆయనను నెహ్రూ యువ కేంద్ర, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ, భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. దేశం నలుమూలల నుంచి 68 మంది యువకులను మేర భారత్ వలంటీర్లుగా ఎంపిక చేయగా, ఇందులో రాష్ట్రం నుంచి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ అవకాశం కల్పించిన అధికారులకు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 11: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని జమ్మికుంట పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో ఆదివారం ఉదయం కానిస్టేబుల్ షణ్ముఖరావు, హోంగార్డు సతీశ్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వంగర గ్రామానికి చెందిన బండారి స్వామి, పొత్కపల్లికి చెందిన రేవెల్లి కుమార్ అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై బియ్యం మూటలు వేసుకుని వెళ్తూ కనిపించారు. వాహనాన్ని ఆపి విచారించగా, గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా సేకరించిన బియ్యాన్ని నిల్వ చేస్తున్నామని చెప్పారు. నిల్వ చేసిన స్థలం వద్దకు పోలీసు సిబ్బంది వెళ్లారు. అక్కడ 14 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడాన్ని గుర్తించారు. సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్వామి, కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెంజర్ల గ్రామ శివారులో 10 క్వింటాళ్లు..

మానకొండూర్ రూరల్, ఆగస్టు 11: చెంజర్ల గ్రామ శివారులో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ జీపులో దాదాపు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు విచారించి శంకరపట్నం మండలం పిల్లిగుండ్ల తండాకు చెందిన నరసింహగా గుర్తించారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆదర్శ రైతుగా విష్ణుమూర్తి

వీణవంక, ఆగస్టు 11: తెలంగాణ ఉత్తమ ఆదర్శ రైతుగా మండల కేంద్రానికి చెందిన మోటం విష్ణుమూర్తిని ఎంపిక చేసి, లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వ్యవసాయంలో 30 సంవత్సరాలుగా మెళకువలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు గానూ విష్ణుమూర్తిని లలిత కళా సమాఖ్య ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా లలిత కళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం తరపున విష్ణుమూర్తికి ప్రశంసాపత్రం, షీల్డ్, సువర్ణ కంకణం అందజేసి ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఆదర్శ రైతుగా మోటం విష్ణుమూర్తి ఎంపిక కావడంపై మాజీ ఎంపీటీసీ మోటం వెంకటేశ్, మిత్రులు రాయిశెట్టి కుమార్, మోటం వెంకటేశ్, దాసారపు రాజు, సమ్మయ్య, గ్రామ, మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు.

'చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి'

రామడుగు, ఆగస్టు 11 : ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమానికి చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ రిజర్వేషన్ సాధనలో అహర్నిశలు కృషిచేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: 22 ఆగస్టు 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	సిరిసిల్లా KRN TG	xxxxxxxxxxx0786	నక్క నాగరాజు	49319	15-మార్చి-24	13.51	11.76
2	సిరిసిల్లా KRN TG	xxxxxxxxxxx2016	తాటిపెల్లి బాబు	87033	07-జూన్-24	19.88	19.28
3	కోరుట్ల C2387 TG	xxxxxxxxxxx8361	కుర్మ ఈశ్వర్	105949	07-జూన్-24	22.64	22.18
4	కోరుట్ల C2387 TG	xxxxxxxxxxx6640	మినిగ సుబ్బయ్య	56808	02-ఏప్రిల్-24	16	14.25
5	రామగుండం	xxxxxxxxxxx4618	గంధం శ్రీనివాస్	50355	07-జూన్-24	9.08	8.98
6	పెద్దపల్లి	xxxxxxxxxxx6062	సుంకరి రూపా వాణి	113073	07-జూన్-24	23.6	23.12

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.
అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్